నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

తడపాకల్ స్కూల్లో ఘనంగా వార్షికోత్సవం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ జడ్పీహెచ్ఎస్‌లో వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు చూపరులను అలరించాయి. ఎంఈఓ ఆంధ్రయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే కాకుండా ప్రభుత్వం సరైన వసతులు కల్పిస్తుందని అన్నారు. ఈ పాఠశాల జిల్లా రాష్ట్రస్థాయిలో మంచి పేరు సంపాదించుకుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై మచ్చేంధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్, పీఆర్టియూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణాచారి, ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆదివారం 'జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ' ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం, అనుసరిస్తున్న చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రెటరీ పి.పద్మావతి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తిలు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లల ఎదుగుదల, వయస్సు పెరిగే కొద్ది ఆడపిల్లలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపారు. ఆడపిల్లలపై అన్యాయం జరిగినప్పుడు అధైర్య పడకుండా అందుబాటులో ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.వినోద, ముప్కాల్ ఎస్ఐ భాస్కరా చారి, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, కోర్టు సుపెరిండెంట్ రమేష్, మండల లీగల్ సర్వీస్ ఇంఛార్జి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పోచారం సురేందర్‌రెడ్డి..?



సుదర్శన్‌రెడ్డిని కలిసిన పోచారం సురేందర్‌రెడ్డి(ఫైల్)

- బోధన్ ఎమ్మెల్యేను కలవడంతో జోరుగా ప్రచారం
- ఏ గట్టునుండాలో..? మల్లగుల్లాలు పడుతున్న నాయకులు


నవతెలంగాణ-కోటగిరి

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు పోచారం సురేందర్‌రెడ్డి త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కొనసాగుతుంది. ఇటీవల ఆయన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలవడంతో ఆ వార్తలకు బలం చేకూరినట్టయింది. సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ.. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన విషయం విధితమే. ఆయనను సురేందర్‌రెడ్డి కలవడంతో కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం మరింత జోరందు కుంది. ఒక వైపు తమ్ముడు పోచారం భాస్కర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి జహీరాబాద్ బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్న వేళ.. అతడి అన్న సుదర్శన్‌రెడ్డి.. సుదర్శన్‌రెడ్డిని కలవడంతో నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది.

ఏ గట్టునుండాలో..?

ఈ నేపథ్యంలో కోటగిరి మండలంలో రాజకీయ పార్టీల నాయకుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఏ రాజకీయ పార్టీలో కలవాలో తెలియక తికమక పడుతున్నారని బొగట్టు!. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో మండల నాయకులు అధికారపక్షం వైపు మెల్లగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. ఈమధ్య సోషల్ మీడియాలో పోచారం సురేందర్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో కలుస్తున్నట్లు ప్రచారం కావడం కొంత బలాన్ని చేకూరుస్తుంది. ప్రతిసారి ఓట్లు వేసినప్పటికీ ఓట్లు వేయలేదని ఒక వర్గం వారిపై శాసనసభ్యులు పోచారం పదేపదే అక్కసు వెలగక్కడంతో వారు అసంతృప్తితో ఉన్నారు. బిజెపి లేదా, కాంగ్రెస్ పార్టీ లో చేరడానికి పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎక్కడ చూసినా ప్రజలలో నాయకులలో చర్చ ముమ్మురంగా సాగుతుంది. వారం రోజుల్లో ఎంపీపీ భర్త, మాజీ వైఎస్ ఎంపిపి వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారని వినికిడి. వార్డు నెంబర్ నుండి మాజీ సర్పంచుల వరకు ఈ గట్టునుంటావా ఆ గట్టునుంటావా అన్న పరిస్థితి నెలకొంది. మండల పరిషత్‌లో అవిశ్వాస తీర్మానం దిశగా పావులు కదుపుతున్నారని సమాచారం. రాబోయే ఎన్నికల దృష్టిలో పెట్టుకొని రాజకీయ నాయకులు ఆచీ తూచీ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి మండలంలో రాజకీయ అనిచ్చితి ఏర్పడింది. బిఆర్ఎస్ నాయకులు కొంతమంది బిజెపి నాయకులతో సఖ్యతగా ఉండటం, కొంతమంది కాంగ్రెస్ నాయకులతో టచ్‌లో ఉండటంతో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. కొంతమంది రాజకీయ నాయకులు బిల్లులు వస్తాయో లేదోనని కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. కొందరు అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. బిఆర్ఎస్ నాయకులలో రాజకీయ భవిష్యత్తు కొంత గందరగోళం ఏర్పడటంతో, మండలంలో అధికార పక్ష నాయకులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికలలో మండలంలో అనుకున్నంత బలం లేకపోవడం, నేడు అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రావడంతో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీలో కలవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆదిలోనే కొర్రీలు



- ఒక్క రేషన్ కార్డుకు ఒక్క మీటరే అనుసంధానం
- రేషన్‌కార్డుకు వేల కుటుంబాలు ఎదురుచూపులు
- ఉచిత విద్యుత్ అమలుకు తూట్లు
- బోర్ మీటర్‌కూ గృహజ్యోతి కట్
- లబ్ధి చేకూర్చడం కంటే కోతలకే ఎక్కువ ప్రాధాన్యత
- విధి విధానాలు కాలేవంటూనే నిబంధనలు అమలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గృహజ్యోతి పథకం.. గృహవసరాలకు 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించేవారికి ఉచితంగా కరెంట్ సరఫరా చేసే పథకం.. అమలుకు ముందే కొర్రీలు పెడుతున్నట్టు ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉచిత విద్యుత్ అమలు కోసమంటూ విద్యుత్ అధికారులు కాలనీలకు వచ్చి వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఒక్క రేషన్ కార్డుకు ఒక్క మీటర్‌నే అనుసంధానిస్తున్నారు. రేషన్‌కార్డు లేని వారికి ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసిన తర్వాత నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. రేషన్ కార్డు లేని కుటుంబాలు వేల సంఖ్యలో ఉండగా.. ఇటీవల ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాయి. మీటర్ నెంబర్ నమోదు చేసుకోకపోవడంతో తామంతా ఉచిత విద్యుత్‌ను పొందలేకపోతామని ఆవేదన చెందుతున్నారు. దీంతో పాటు బోర్ కోసం సెపరేట్ ఉన్న మీటర్ వివరాలు సైతం నమోదు చేయడం లేదు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీ పథకాలను గ్యారెంటీగా అమలు చేస్తామని చెప్పిన పాలకులు.. అధికారంలోకి రాగానే పథకాల అమల్లో కొర్రీలు పెట్టడం సరికాదని లబ్దిదారులు వాపోతున్నారు.

ఆరు గ్యారెంటీలు.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సంధించిన అస్త్రం సఫలమై అధికారాన్ని కట్టబెట్టింది. అధికారంలోకి రాగానే అందులోని రెండు గ్యారెంటీలైన ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఆరోగ్య శ్రీ వైద్య చికిత్స పరిమితి రూ.10 లక్షలకు పెంచడంతో ప్రశంసలు దక్కాయి. దీంతో పాటు మరో రెండు గ్యారెంటీలైన 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, గ్యాస్ సిలెండర్ ధర రూ. 500 అమలు కోసం కసరత్తు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. దీంట్లో భాగంగా దరఖాస్తు దారుల గ్యాస్ ఏజెన్సీ, ఐడీ వివరాలు పరిశీలిస్తూ తప్పుగా వచ్చిన వారి వివరాలు సరి చేస్తున్నారు. గృహజ్యోతి కింద కరెంట్ మీటర్ వివరాలు విద్యుత్ శాఖ అధికారులు సేకరిస్తున్నారు.

ఒక్క రేషన్ కార్డుకు ఒక్క మీటరే..

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా గృహవసరాలకు వినియోగించే విద్యుత్ మీటర్‌లు 5 లక్షల 23 వేలు వరకు ఉన్నాయి. అయితే రేషన్ కార్డుల 4 లక్షల 2 వేలు ఉన్నాయి. కొత్తగా పెండ్లి అయిన వారు, కుటుంబాల నుంచి వేరు పడ్డవారు ఇలా సుమారు 40 వేల కుటుంబాలు రేషన్ కార్డుల కోసం ఇటీవల దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నాయి. అయితే విద్యుత్ అధికారులు మీటర్ వివరాలు నమోదు చేసేందుకు రేషన్ కార్డు అడుగుతుండటంతో పాటు ఒక్క రేషన్ కార్డుకు ఒక మీటర్‌నే అనుసంధానం చేస్తున్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో తమకు ఉచిత విద్యుత్ అందుతుందోలేదోనని ఆందోళన చెందున్నారు. వివరాల నమోదు కోసం మీటర్ నెంబర్‌తో పాటు, ఆధార్, రేషన్‌కార్డు నెంబర్, ప్రజాపానలో దరఖాస్తు చేసుకున్న నెంబర్ వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించే సమయంలో పలు చోట్ల రేషన్‌కార్డు లేని వారికి ఫాంలు ఇవ్వలేదు. వారికి వైట్ పేపర్ మీద రేషన్‌కార్డుకు కోసం వినతి చేసుకోవాలని అధికారులు సూచించడంతో చాలా మంది అదే విధంగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులు మాత్రం ప్రజాపాలన దరఖాస్తు నెంబర్ అడుగుతుండటంతో తాము ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 3 లక్షల మీటర్‌ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

అన్ని పథకాల అమలుకు రేషన్ కార్డు ప్రమాణికం పెడుతున్నారని, కానీ రేషన్ కార్డులు మాత్రం మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. గృహజ్యోతి పథకం అమలు విధివిధానాలు ఇంకా ఖరారు కాకున్నా.. విద్యుత్ శాఖ అధికారులు కొర్రీలు పెడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. బోర్‌కు సెపరేట్ మీటర్ ఉన్నా.. అనుసంధానం చేయడం లేదని, ఇంట్లో మూడు మీటర్‌లు ఉంటే ఒక మీటర్ వివరాలు మాత్రమే నమోదు చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పథకాల ప్రయోజనం ఎక్కువమందికి చేరవేర్చడం కంటే కొర్రీలు పెడుతూ తక్కువమందికి చేరేలా చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి. పాలకులు స్పందించి కొర్రీలు లేకుండా గృహజ్యోతి అమలు చేయాలని లబ్దిదారులు డిమాండ్ చేస్తున్నారు.



విధివిధానాలు ఖరారు కాలేదు

ఎస్ఈ రవీందర్

ప్రస్తుతం మీటర్‌తో పాటు ఫోన్, ఆధార్, రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు నెంబర్ వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నాం. ఒక్క రేషన్ కార్డు ఉన్న వారికి ఒక మీటర్‌కే అనుసంధానం చేశాం. మీటర్ లేని వారికి ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్‌కార్డు లేదనే ప్రత్యేకంగా వివరాలు నమోదు చేస్తున్నాం. వివరాల నమోదుకు చివరి గడువు అంటూ ఏమీ లేదు. ఒకవేళ ఎవరైనా నమోదు చేసుకోకుంటే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి సంబంధిత శాఖ అధికారులను కలిసి నమోదు చేయించుకోవచ్చు.

కల్లు గీత వృత్తికి ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలి

- కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్‌గౌడ్



మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై 5 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అలాంటి వృత్తినికి ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. కల్లు షాపులు ఆధునీకరణ కోసం డబ్బులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం కల్లు గీత కార్మికులు సమావేశమై తమ సమస్యలను చర్చించుకున్నారు. అనంతరం కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ఈత, తాటి చెట్ల పెంపకానికి ప్రతి గ్రామానికి 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. 560 జీవోను అమలు చేయాలని, ఆసరా పింఛను అర్హులైన గీతా కార్మికుల అందరికీ అమలు చేయాలని, గీత కార్మికుల కు బైక్ లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు సాయగౌడ్, నారాగౌడ్, శంకర్ గౌడ్,రవిగౌడ్, భస్వగౌడ్, స్వామిగౌడ్, రమేష్ గౌడ్, గంగా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యతనివ్వాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటి

నవతెలంగాణ-ఆర్మూర్

గత ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కొత్త ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత నివ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఏ వెంకటి డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భం గా ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పాఠశాలలకు కనీసం సర్వీస్ పర్సన్‌ను కూడా నియమించ లేదని, కొత్త గురుకులా లను స్థాపించినప్పటికీ విద్యార్థులకు తగిన వసతులు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. లోకల్ బాడీ ఉపాధ్యాయులకు సంవత్సరాల తరబడి బదిలీలు ప్రమోషన్లు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, 317 జీవో ను తీసుకువచ్చి ఉపాధ్యాయు లను చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యేలా చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచీ ప్రతి ఏటా బడ్జెట్‌లో ఒక శాతం నిధులు విద్యారంగానికి తక్కువ కేటాయించి, 14.5 నుండి 6.5 తెచ్చిందని సిపిఎస్ విధానాన్ని రద్దు చేయలేదని అన్నారు.

కొత్తగా అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం విద్యారంగానికి 15 శాతం నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని ఉపాధ్యాయులకు బదిలీలు ప్రమోషన్లు ప్రతి సంవత్సరం నిర్వహించాలని కోరారు. 317 జీవో వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరినీ తమ సొంత జిల్లాలకు కేటాయించాలని, టెటితో సంబంధం లేకుండా పదోన్న తులు ఇవ్వాలని, నూతన పిఆర్‌సి రిపోర్టును సాధ్యమైనంత తొందరగా తెప్పించుకొని ఉపాధ్యాయుల వేతన స్కేల్స్ మధ్య అంతరాలను తొలగించాలని డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయులకు పిఆర్‌టీ స్కేల్స్ అమలుచేసి బదిలీలు పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలని ,కేజీబీవీ ,యు ఆర్ సి పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి సమాన పనికి సమాన వేతన ప్రకారం బేసిక్ పే అమలు చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, మాడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు బదిలీలు ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభిం చాలని, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. సిపిఎస్‌కి మూల కారణమైన పిఎఫ్ఆర్‌డిఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సత్యానంద్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి మల్లేష్, జిల్లా కార్యదర్శులు సాయన్న ఆనందం, రాజారాం, బబ్లు, పద్మావతి మండల నాయకులు రాజు, లింబగిరి స్వామి, నరసయ్య, రవీందర్, శ్రీనివాస్, భూమేశ్వర్, బా వాయి, పుష్ప పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు

డబ్బులు తిరిగిచ్చేస్తాం..

- డబుల్ బెడ్ రూం బాధితులను బతిమిలాడుతున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

'డబుల్' పేర వసూళ్ల అనే శీర్షికతో నవతెలంగాణలో కథనం ప్రచురితం కావడంతో పాటు ఓ బాధితురాలు పోలీస్టేషన్‌లో నేరుగా ఫిర్యాదు చేయడంతో సదరు నాయకులు తిరిగి డబ్బులు చెల్లిస్తామంటూ బతిమిలాడుతున్నట్టు సమాచారం. మద్నూర్ మండలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు కోసం వేలాది రూపాయల వసూళ్లు చేయడం పట్ల నవతెలంగాణ వరుస కథనాలు వెలువరించడంతో డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు ధైర్యంగా ముందుకు వచ్చి ఇచ్చిన డబ్బులు అక్రమ దారుల నుండి వసూళ్లు చేసేందుకు పోలీస్ స్టేషన్ వరకు వెళ్తున్నారు. మద్నూర్ మండలంలోని పెద్ద తడగూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ శనివారం నాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఆ మహిళా ఫిర్యాదు పై పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయింది. అయితే ఆదివారం ఉదయం తీసుకున్న డబ్బులు తిరిగి ఆ మహిళకు ఇచ్చేందుకు సదరు నాయకుడు బతిమిలాడు తున్నట్లు తెలిసింది. డబుల్ బెడ్ రూమ్ మంజూరు కోసం వసూళ్లు చేసిన వేలాది రూపాయలు అక్రమదారులే కాజేశారు అనటానికి పెద్దత్తడుగూరు గ్రామంలో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడానికి బతిమిలాడుతున్న సమాచారమే నిదర్శనం. ఇలాంటి వసూళ్ల వ్యవహారం మండలంలోని ప్రతి గ్రామంలో జరిగినట్లు వేలాది రూపాయల వసూళ్లు డబ్బులు తీసుకున్న వ్యక్తులు లబ్ధిదారులకు స్వచ్ఛందంగా ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇప్పించడానికి లబ్ధిదారులు పోలీస్ స్టేషన్కు వచ్చేవరకు తీసుకున్న వ్యక్తులు ఇచ్చే రీతిలో కనిపించడం లేదు. వసూళ్లను తిరిగి ఇవ్వని వ్యక్తులపై చట్ట రిత్యా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం స్పందించాలని డబుల్ బెడ్ రూమ్ పేరుతో మోసపోయిన లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు నిర్మించారు మట్టితో పూడ్చడం మరిచారు

- బిల్లుల మంజూరులో అధికారుల చేతివాటం?
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

నవతెలంగాణ-సదాశివనగర్



మొరం వేయకుండా వదిలిన రోడ్డు

మండలం లోని పద్మాజివాడి గ్రామంలో సి.సి రోడ్ల నిర్మాణం చేపట్టారు. కానీ సి.సి రోడ్లకు ఇరువైపులా మట్టి పోయాల్సి ఉండగా.. అలాగే వదిలేశారు. స్థానిక ఏ.ఈ మారుతి పనులను పరిశీలించకుండానే ఎం.బి రికార్డులు చేసి బిల్లులు డ్రా చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

పద్మాజివాడి గ్రామ పంచాయతీ పరిధిలోని పద్మాజివాడి చౌరస్తాలోని కాలనీతో పాటు వైకుంఠధామానికి సి.సి రోడ్డును నిర్మించారు. కానీ సి.సి రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసిన దాఖలాలు లేవు. దీంతో వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ సమస్యపై ఏ.ఈ మారుతిని ఫోన్‌లో వివరణ కోరగా.. 'మట్టి తర్వాత పోస్తారు' అని సమాధానం ఇచ్చారు. పనులు మొత్తం పూర్తయ్యాకే సంబంధిత కాంట్రాక్టర్‌లకు బిల్లులు మంజూరు చేయాలి. కానీ సంబంధిత ఏ.ఈ సీసీ రోడ్డు పనులను పరిశీలించకుండానే ఎం.బి చేశారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులకు చేతివాటంతో బిల్లులు చేశారని పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ సక్సెస్

- కామారెడ్డిలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభాపరీక్ష
- పోరాటాలే కాదు.. ప్రతిభ వెలికితీయడం అభినందనీయం : ఎస్ఐ, ఎంఈవో

నవతెలంగాణ-కామారెడ్డి



పరీక్షకు హాజరైన పలువురు పదో తరగతి విద్యార్థులు



ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఎంఈవో, ఎస్ఐ తదితరులు

పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజయవంతమైంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీ సాందీపని జూనియర్ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు 900 మంది విద్యార్థులు హాజరై పరీక్షలలో పాల్గొన్నారు. పరీక్ష ప్రశ్నపత్రాలను కామారెడ్డి ఎంఈఓ ఎల్లయ్య, కామారెడ్డి పట్టణ ఎస్సై అనిల్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, సాందీపని విద్యా సంస్థల డైరెక్టర్ రాజేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదాం అరుణ్, ఎస్ అజయ్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థులకు ఉన్న భయాన్ని పోగొట్టి వాళ్లలో అవగాహన తీసుకురావడానికి ఇలాంటి పరీక్షలు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సంసిద్ధం అవుతున్న సందర్భం లో ఇలాంటి పరీక్ష నిర్వహించడం వారికి ఎంతగానో ఉపయోగపడు తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థు లకు అభినందనలు తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ కేవలం విద్యార్థుల సమస్యల పట్ల పోరాటాలు నిర్వహించడమే కాకుండా ఇలాంటి పరీక్షలు నిర్వహించడం అభి నందనీయమని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహిం చడంలో ముందుం డాలని తెలిపారు. కార్యక్రమంలో సాందీపని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, నితిన్, సమీర్, విష్ణు, సాయి, రాహుల్, సచిన్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ 2
నిజామాబాద్
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

జాతీయ కౌన్సిల్‌లో బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

డిల్లీలో జరుగుతున్న బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశంలో నిజామాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గడ్డె భూమన్న పాల్గొన్నారు.



ఆలయానికి రూ.30వేల విరాళం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలోగల స్వయంభు శిలా తీర్థ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంకి 30వేల రూపాయలు జక్రాన్ పల్లి గ్రామానికి చెందిన గడ్డం గంగారెడ్డి ఆదివారం ఆలయ కమిటీకి విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శేఖర్ గౌడ్ లింగారెడ్డి, యోగానంద గౌడ్, విలాస్ తదితరులు పాల్గొన్నారు,


విరాళం అందజేస్తున్న గడ్డం గంగారెడ్డి

పారిశుధ్య కార్మికులకు సన్మానం


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న తిరుమల గంగారాం

నవతెలంగాణ-ఆర్మూర్

నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం సిద్దుల గుట్ట వద్ద ఆదివారం ధ్యాన ఆత్మ జ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవనాథసిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ ఏనుగు తిరుమల గంగారాం తన మనుమడు ధ్రువిన్ రెడ్డి మొదటి జన్మదినం సందర్భంగా ఆర్మూరు పట్టణంలో గల 11 ,12వ వార్డులకు చెందిన పారిశుధ్య కార్మికులు 24 మందిని శాలువాతో ఘనంగా సన్మానించి వారికి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పిఎస్-ఎస్ఎం జిల్లా అధ్యక్షులు బి. సాయికృష్ణా రెడ్డి, ఆర్గుల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, సభ్యులు మామిడి లక్ష్మారెడ్డి, పెంబర్తి నారాయణ, శేఖర్ రెడ్డి, అమరవాజి శ్రీనివాస్, రెడ్డి మల్లయ్య, అక్లూర్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన పద్మశాలీ కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కంఠేశ్వర్

న్యాల్కల్ రోడ్‌లోగల పద్మశాలి సంఘం తర్ప-16లో మొన్న జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు అవధూత రాములు, కార్యవర్గం ముఖ్య అతిధి పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు దీకొండ యాదగిరి సమక్షంలో ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడు అవధూత రాములు, ప్రధాన కార్యదర్శి సబ్బని రవి కుమార్, కోశాధికారి బిల్ల లింబాద్రి, ఉపాధ్యక్షులు పెంటి దుర్గాదాస్, వాసం రవీందర్, సూరం రమేష్, సహాయ కార్యదర్శులు బొద్దుల రామకృష్ణ, వల్లకాటి ప్రణీత్, గంజి రాజు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని యాదగిరి పేర్కొన్నారు. తదుపరి వర్కింగ్ ప్రెసిడెంట్ పులగం హనుమండ్లు మాట్లాడుతూ సంఘంను అభివృద్ధి పథంలో నడిపి జిల్లా లోనే పేరు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సంఘం కార్యదర్శి ఏనుగందుల మురళి,మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యపాల్ ,మాజి ఉపాధక్షుడు రవి, తర్ప 16 మాజి అధ్యక్షుడు దోర్నాల రాజు, సబ్బని ప్రసాద్, మ్యాన ఎల్లయ్య పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ, పోచమ్మకు బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గౌడకులస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

శ్రీ రేణుక ఎల్లమ్మ 15వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గౌడ సంఘ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగ వేడుక ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులు పాటు కన్నుల పండుగ జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ వేడుకల్లో మామిడిపల్లి పరిసర ప్రాంత ప్రజలందరూ పాల్గొనాలని గౌడ సంఘ ప్రతినిధి మెడిదల రవి గౌడ్ అన్నారు. ఈ వేడుకల్లో మెడిదల మహేందర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, సాగర్ గౌడ్, మాణిక్యం గౌడ్,నరేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, దామోదర్ గౌడ్, సురేందర్ గౌడ్, శ్యామ్ గౌడ్, సందీప్ గౌడ్, యాదగిరి గౌడ్, చిట్టి గౌడ్, నరేందర్ గౌడ్, తూర్పు మహేందర్ గౌడ్, శ్రీరాములు గౌడ్, మామిడిపల్లి గౌడ సంఘం, గౌడ యువకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ (దుబ్బ) గ్రామభివృద్ధి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా తమ్మే కపిల్, ఉపాధ్యక్షుడిగా బొంత రాములు, కోశాధికారిగా జక్క రాజలింగం, కార్యదర్శిగా ర్యపాన్ పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా తమ్మే లింగయ్య అశ్వాక్ , పిల్లి మహేందర్ , క్రొమే ఎల్లయ్యను ఎన్నుకొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛ కాలనీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గత 34 వారాలుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోడ్డు నెంబర్ 7లో శ్రమదానం చేశారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీ వాసులు కలిసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. చెత్త కాగితాలను, వ్యర్థాలను కుప్పలుగా పోసి కాల్చేశారు. మురుగు కాలువలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు నిండి నీరు నిలిచి దుర్గంధం రావడంతో వాటిని తొలగించి నీరు పోయేలా చేశారు. ఈ సందర్భంగా మురుగు కాలువలో ప్లాస్టిక్ కవర్లు వేయెుద్దని ప్రతినిధులు స్థానికులకు సూచించారు. జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్, కాలనీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, ఉపాధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, కార్యదర్శులు కొంతం రాజు, ఎల్.సాయన్న, రాజ్ కుమార్, ఎస్సారెస్పీ డీ ఈ గణేశ్, ఎర్ర భూమయ్య, బోల్లు జీవన్, ఎం.సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డ్

- స్థలం కోసం 12 ఏండ్లుగా బాధితుని పోరాటం
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

కాలనీల్లో సేకరించిన చెత్తను తడి చెత్త పొడి చెత్తలుగా వేరుచేసి రీసైక్లింగ్ చేయడానికి పట్టణంలోని మల్లారెడ్డి చెరువు ప్రాంతంలో లక్షలు వెచ్చించి సొంత భూమిని కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. రీసైక్లింగ్ కోసం అన్ని రకాల పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది కోసం మూత్రశాలలు, మరుగుదొడ్ల సైతం ఏర్పాటు చేసిన అధికారులు ప్రస్తుతం దానిని నిరుపయోగంగా వదిలేశారు. పెర్కిట్ జాతీయ రహదారి ప్రాంతంలో మరో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేశారు. 2010లో ప్రభుత్వం మున్సిపల్ పరిధిలో డంపింగ్ యార్డ్ కోసం 1220/2 సర్వే నంబర్లో 11 ఎకరాల 9 గుంటల స్థలాన్ని ఎకరాన రూ 3 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. ఆటు తర్వాత మున్సిపల్ అధికారులు సుమారు 20 లక్షల రూపాయలు ఖర్చు చేసి


వృథాగా మారిన డంపింగ్‌యార్డు

రీసైక్లింగ్ కోసం పరికరాలు, సిబ్బంది కోసం గదులు మూత్రశాలలు, మరుగుదొడ్లు సైతం నిర్మించి వదిలేశారు.

స్థల విషయంలోనూ వివాదం..

డంపింగ్ యార్డ్‌కు కేటాయించిన స్థలం విషయంలోనూ వివాదం కొనసాగుతోంది. 2010లో 1220/2 సర్వే నంబర్ లోని 11 ఎకరాల 9 గంటల స్థలాన్ని స్థల యజమాని నుంచి డంపింగ్ యార్డ్‌కు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదరగా ఎకరాన మూడు లక్షల చొప్పున కొనుగోలు చేశారు. కాగా పక్కనే ఉన్న మరో 12,19సర్వే నంబర్‌లోని స్థలాన్ని నాటి ఓ రెవెన్యూ అధికారి 2012లో సర్వే నెంబర్లను అటు ఇటుగా తారుమారు చేశారు. దీంతో మున్సిపల్ డంపింగ్ యార్డ్‌కు కొనుగోలు చేసిన స్థలం సర్వే నంబర్‌లలో పేర్లు మార్చడంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో సదరు బాధితులు పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినప్పటికీ స్థల విషయంలో ఇప్పటివరకు ఎటువంటి పురోగతి సాధించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్రద్ధ వహించి నిబంధనల ప్రకారం తమ సర్వే నంబర్లకు అనుగుణంగా తమ భూమిని తమకు కేటాయించాలని బాధితులు కోరుతున్నారు.

నిరక్షరాస్యుని చూసి మోసం చేశారు


సనుగుల గంగాధర్

2010 లో మున్సి పాలిటీ డంపింగ్ యార్డ్‌కు సర్వే నంబర్ 12, 20 లోని 11 ఎకరాల 30 గుంటల స్థలం అలాట్ అయి ంది. పక్కనే ఉన్న 12,19 సర్వే నంబర్‌లోని సుమారు 10 ఎకరాల నా స్థలాన్ని నా నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలిసి 2012లో సర్వే నంబర్లు తారుమారు చేసి నాకు తీరని అన్యాయం చేశారు. నా స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్ల రూపాయలకు అమ్ముకున్నారు. నాకు రావాల్సిన డబ్బులు ఇప్పటికీ నాకు చెల్లించకుండా నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇకనైనా అధికారులు తప్పును సరిద్దుకొని నాకు న్యాయం చేయాలి.

బీసీల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- ఎమ్మెల్సీకి బీసీ నాయకుల సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్

కామారెడ్డి బీసీ డిక్లరేషన్, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుల గణన తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం జరిగిందని, బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి, పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళీ అధ్వర్యంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను జిల్లా కేంద్రంలోని అయన స్వగృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ...కుల గణన ఆమోదం సంతోషకరమని, ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదం లో పాలు పంచుకోవడాన్ని జీవితంలో మర్చిపో లేనన్నారు. బీసీ ప్రజాప్రతినిధుల కృషి అమోఘమని కొనియాడారు. కుల గణనతో మెజార్టీ వర్గాలైన బీసీలకు సముచిత స్థానాలు దక్కుతాయని, అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందని వివరించారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని, సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, మురళీ, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్ మాట్లాడుతూ.... నిజామాబాద్ బీసీ ముద్దు బిడ్డ మహేష్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ రావడం సంతోషకరమన్నారు. కరడుగట్టిన కాంగ్రెస్ వాది అయిన మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల కలయిన కుల గణన ఆమోదానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధు గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు స్వప్న అధ్వర్యంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి అమంద్ ప్రవీణ్ కుమార్, నగర కార్యదర్శి కస్తూరి కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

పాఠశాలకు ఆట పరికరాల అందజేత


అందజేసిన ఆటపరకరాలు

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

మండలంలోని కుక్కునూరు ప్రాథమిక పాఠశాలకు ఎజిలిటీ అనే ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ ఆట పరికరాలను అందజేసినట్టు హెడ్మాస్టర్ నరేందర్ ఆదివారం తెలిపారు. ఐదు సంవత్సరాలుగా ఈ పాఠశాలను దత్తత తీసుకున్న ఆ సంస్థ అనేక రకాలుగా ఆర్థిక సహాయం అందజేస్తూ పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాజీ సర్పంచ్, ఎస్ఎంసి చైర్మన్,ఉపాధ్యాయ బృందం సంస్థ నిర్వాహకులు సురేష్, మనోహర్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను టీఎస్‌యూటీఎస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి డైరీ బహూకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదు ర్కొంటున్న సమస్యల్ని వివరించారు. ఈ ఎమ్మెల్సీ ప్రతి అంశాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, అదేవిధంగా ఉపాధ్యాయులు ఎస్ఎస్‌సి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అందరూ ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ (వాసు), ఎయిడెడ్ టీచర్స్ రాష్ట్ర కో కన్వీనర్ రవీందర్ గౌడ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కాంతారావు, నిజామాబాద్ అర్బన్ అధ్యక్షులు సన ఉద్దీన్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీకి డైరీ అందజేస్తున్న ప్రతినిధులు

పెరిగిన వీడీఏ అమలుకు పోరాడండి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

పెరిగిన కరువు భత్యం (వీడీఏ) అమలు కోసం పోరాడాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) నాయకులు తెలిపారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని కోటగల్లీలోగల శ్రామిక భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గల బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు కరువు భత్యం (వీడీఏ) పెరిగిందన్నారు. వినిమయ ధరల సూచి 1696 నుండి1809 పాయింట్లకి పెరిగిందని తెలిపారు. అంటే 113 పాయింట్లు పెరిగాయని, 1994 అగ్రిమెంట్ ప్రకారం పాయింటుకు 10 పైసల చొప్పున, 11 రూపాయల 30 పైసలు పెరిగిందని తెలిపారు. ఈ పెరుగుదల 2024 ఏప్రిల్ 01 నుండి అమలులోకి వస్తుందని తెలిపారు. బీడీలు చుట్టే కార్మికులకు 1000 బీడీలకు కరువు భత్యం(విడిఏ) 11.30 పైసలు గాను పెరిగి 245 రూపాయల 08 పైసలు అవుతుందన్నారు. నెలసరి జీతాల ఉద్యోగులైన బీడీ సార్టర్, ఆకు, తంబాకు పంచేవారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టీవాల, చెన్నీవాల, గంపవాల, వాచ్ మెన్ లకు నెలకు 339 రూపాయల చొప్పున పెంచి 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ ప్యాకర్లకు ఒక్కరోజు పనికి 11 రూపాయల 30 పైసలు చొప్పున వివిధ రకాల నమూన బీడీ ప్యాకింగ్ కలిగిన లక్ష బీడీ ప్యాకింగుకు కరువు భత్యం ఎంత అనేది నిర్ణయించబడుతుందని తెలిపారు. పెరిగిన కరువు భత్యంతో రాష్ట్రంలోని 07 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకన్న, జిల్లా నాయకులు బి.లింగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వనమాల కృష్ణ

సర్కిల్ పోల్ లైట్ల ఏర్పాటు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్‌లో జడ్పీటిసి సభ్యురాలు పెరుమాండ్ల రాధా రాజా గౌడ్, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అందించిన నిధులతో ఏర్పాటు చేసిన సర్కిల్ పోల్ లైట్లను బిగించినట్లు మాజీ సర్పంచ్ సక్కరం అశోక్ తెలిపారు. గ్రామంలో మూడు నెలల క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్కిల్ పోల్ లైట్లను ఏర్పాటు చేయడానికి తీర్మానం చేసినట్లు వివరించారు. పోచమ్మ గుడి వద్ద, అంబేద్కర్ విగ్రహం వద్ద సర్కిల్ లైట్లను ఆదివారం పెట్టించడం జరిగిందన్నారు. గ్రామంలో వివేకానంద విగ్రహం దగ్గర, కంబోడ వద్ద కూడా సర్కిల్ పోల్ లైట్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. నిధులు అందించిన జడ్పీటీసి, ఎంపీపీలకు ధన్యవాదాలు తెలిపారు.


లైట్లను బిగిస్తున్న సిబ్బంది

బీసీ కుల గణన.. చారిత్రాత్మక నిర్ణయం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమైన నిర్ణయం అని బీసీ హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీసీ హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాయ వార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలోఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులాల లెక్కలకు చట్టబద్ధత భరోసా కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీసీ కుల గణన చేపట్టడం బీసీ సబ్ ప్లాన్ పైన కూడా అసెంబ్లీలో చర్చించడం బీసీలకు పెద్ద ఎత్తున నిధులు సమీకరించడం వారి అభ్యున్నతికి పాటుపడటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టడం హర్షదాయకమని అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు అశోక్, కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు ఎన్ సత్యనారాయణ, సుదర్శన్, పురుషోత్తం, దాస్, మహేందర్ గౌడ్, లక్ష్మణ్, రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న బీసీ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు

పాస్టర్ అసోసియేషన్ ఏర్పాటు

నవతెలంగాణ-నందిపేట్

మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆంధ్రనగర్‌లోని కరుణామయ చర్చిలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులుగా పాస్టర్ టి. ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా పాస్టర్ ప్రశాంత్ రాజ్, కార్యదర్శిగా పాస్టర్ శౌరిబాబు, సంయుక్త కార్యదర్శి గా రెవరెండ్ బి. కృపాకర్, కోశాధికారిగా పాస్టర్ రవి విల్సన్, అసోసియేట్ కార్యదర్శి గా ఎస్.సాగర్, ముఖ్య సలహాదారులుగా పాస్టర్ సల్మాన్ జాషువా, పాస్టర్ కె. పీటర్ ఎన్నికైనట్లు అసోసియేషన్ కార్యవరం తెలి పింది.


ఎన్నికైన కమిటీ సభ్యులు

కోడి శ్రీరాములుకు ఘన నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్

ఖమ్మం జిల్లా అరుణోదయ అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు కోడి శ్రీరాములు రోడ్డు ప్రమాదంలో ఈనెల17 దుర్మరణం చెందడం విషాదకరమని అరుణోదయ సాంస్కృతిక సమైక్య నాయకులు నాగన్న, దాస్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనకు నివాళ్లు అర్పించారు. భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగే పోరాటంలో శ్రీరాములు చిరస్మరణీయుడుగా నిలిచాడని అన్నారు.

ధ్వజం స్తంభం ఏర్పాటులో అభ్యంతరం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన హిందూ వాహిని ధ్వజస్తంభం పెయింట్ వేస్తుండగా, ఒక వర్గం అభ్యంతరం తెలిపారు. ఇరు వర్గాల వారిని బోధన్ ఏసీపీ పిలిపించుకొని వాస్తవాలను పరిశీలించిన తర్వాత ధ్వజస్తంభం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారని హిందు వాహిని కార్యకర్తలు పేర్కొన్నారు. 2011లో ఆ స్థలంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేశారని, వాస్తవాలను తెలుసుకున్న ఏసిపి శాంతియుతంగా ఇరువర్గాలకు నచ్చచెప్పారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతియుతంగా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆయన వారికి సూచించారు.



ద్విచక్ర వాహనాలు సీజ్

నవతెలంగాణ-దోమకొండ

నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా 8 ద్విచక్ర వాహనాలు, 1ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మురికి కాలువ నిర్మించారు..
సీసీ రోడ్డును డ్యామేజ్ చేశారు

సీసీ రోడ్డు చివరన గుంతలుగా మారిన వైనం

- కనీస మరమ్మతులు చేపట్టని కాంట్రాక్టర్
- సమీపంలోనే అంగన్‌వాడీ..
  చిన్నారులు రోడ్డు దాటాలంటే ఇబ్బందులు

నవతెలంగాణ-వర్ని

ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన రోడ్డు నాలుగు కాలల పాటు చక్కగా ఉండాలి. కానీ ఓ కాంట్రాక్టర్ ఆ రోడ్డు పక్కనే మురికి కాలువను నిర్మించి ఉన్న సీసీ రోడ్డును డ్యామేజ్ చేశారు. దీంతో సీసీ రోడ్డు.. మురికి కాలువకు మధ్యలో మరో చిన్నపాటి కాలువలా మారింది. దీంతో ఆ రోడ్డు గుండా నడవాలంటే పాదచరులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ఆ రోడ్డు పక్కన కనీస మరమ్మతులు చేపట్టకుండా అలాగే వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలోని మైనార్టీ కాలనీలో సీసీ రోడ్డును రెండేండ్ల క్రితం నిర్మించారు. ఈ మధ్యకాలంలోనే సీసీ రోడ్డు పక్కన మురికి కాలువ నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా సీసీ రోడ్డు పక్కన కాలువల తవ్వారు. మురికి కాలువ నిర్మాణం పూర్తయింది. దీంతో సీసీ రోడ్డుకు, మురికి కాలువకు మధ్యన మరో చిన్నపాటి కాలువలా మారింది. ఈ రోడ్డు దాటాలంటే చిన్నపిల్లలతో పాటు, పెద్దలూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాలనీవాసులు కనీసం టూవీలర్, త్రీ వీలర్ వాహనాలు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలు సైతం రోడ్డు గుండా దాటి వెళ్లాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అదుపుతప్పి అటువైపు గుంతలో పడి ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ మాత్రం నామమాత్రంగా మురుగు కాలువను నిర్మించి సీసీ రోడ్డుకు ఇరువైపులా గుంతలను సిమెంటు లేదా మొరంతో కానీ గుంతలను పూడ్చలేదు. గ్రామపంచాయతీ ప్రత్యేక పాలనలో ప్రత్యేక అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

ప్రక్కనే అంగన్వాడీ సెంటర్..

సీసీ రోడ్డుకు సమీపంలోనే అంగన్వాడి సెంటర్, ప్రైమరీ స్కూలు ఉన్నాయి. ఆ విద్యార్థులు ఇదే రోడ్డు గుండా వస్తూ, పోతూ ఉంటారు. రోడ్డు దాటే సమయంలో గుంతలో పడే ప్రమాదముందని కాలనీవాసులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు తమ కాలనీలో సిసి రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చిన్నపాటి కాలువను పూడ్చాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డుకు, మురికి కాలువకు మధ్యన గుంత

మేడారం జాతరకు బస్సు సౌకర్యం

- స్థానిక గ్రామాలకు బస్సు కొరత

నవతెలంగాణ-నసురుల్లాబాద్



బాన్సువాడ డిపో పరిధిలోగల భక్తుల సౌకర్యార్థం మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ ఆర్టీసీ బాన్సువాడ డిపో మేనేజర్ సరితా దేవి తెలిపారు. ఆదివారం బస్సు డిపోలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఈనెల 19 నుంచి 25 అంటే (సోమవారం నుంచి సోమవారం వరకు) ప్రయాణికులకు రవాణా సౌకర్యాన్ని కల్పించడానికి, బాన్సువాడ డిపో నుంచి 62 బస్సులు వరంగల్ జిల్లాకు వెళ్తున్నాయని, కావున ఈ సమయంలో జిల్లాలో బస్సుల ట్రిప్పుల సంఖ్యను తగ్గించినందుకు ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలగవచ్చునని ఆమె పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనంలోకి తీసుకొని ఆర్టీసీకి సహకరించాలని కోరారు.

గిరిజన విద్యార్థికి ఆపన్న హస్తం



ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని అయ్యపల్లి తండాకు చెందిన మునావత్ స్వర్ణ అనే గిరిజన వైద్య విద్యార్థిని నల్గొండలో ఎంబిబిఎస్ నాలుగవ సంవత్సరం చదువుతున్నది. చదువుకు గానూ ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గిరిజన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థను సంప్రదించగా జూకంటి అనిల్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ చంద్రశేఖర్, వంగ మహేందర్, జీ మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్ సహకారంతో స్వర్ణ కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్‌రావు, తోట సాయిలు, రజనీకాంత్ గౌడ్, సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి పై స్థాయికి వెళ్లి సమాజ సేవలో ముందుండాలని అన్నారు. ఏ విద్యార్థి అయినా ఆర్థిక పరిస్థితి బాగోలేక చదువు మధ్యలో ఆపివేయకుండా తమకు తోచినంత సహాయం అందిస్తామని తెలిపారు. అమ్మాయి చదువులకు, విద్యార్థుల చదువులకు చేదోడు వాదోడుగా నిలుస్తూ ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న దాతలందరికీ ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తోట సాయిలు, రజినీకాంత్, కృష్ణాకర్‌రావు, దీక్షిత్, సత్యనారాయణ, నవీన్, రామచంద్రం, రమేష్, గురువేందర్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంల నుంచి డీజిల్ దొంగతనం



తెరిచి ఉన్న డీజిల్ ట్యాంకర్ మూత

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో గల హెచ్‌పి పెట్రోల్ పంపులో నిలిపి ఉంచిన రెండు డీసీఎంలలోని డీజిల్ ట్యాంకు నుంచి 400 లీటర్ల డీజిల్ దొంగతనం జరిగినట్టు డీసీఎం యజమాని కొత్త సంతోష్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. లింగంపేట్ గ్రామానికి చెందిన వ్యాపారవేత కొత్త సంతోష్ తనకు చెందిన రెండు డీసీఎంలను రోజువారీగా రాత్రివేళ పెద్దవాగు సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ పంపులో నిలిపి ఉంచాడు. శనివారం డీసీఎంలను రాత్రివేళ బంకులో నిలిపి ఉంచి డ్రైవర్లు తమ ఇండ్లలోకి వెళ్లిపోయారు. ఉదయం డ్రైవర్లు కిరాయి ఉండడంతో డీసీఎంలు నిలిపి ఉంచిన చోటకు వెళ్లి చూడగా.. డీజిల్ ట్యాంకులో నుంచి ఖాళీ అయ్యింది. ఒక్కొక్క డీసీఎం నుంచి 200 లీటర్ల చొప్పున 400 లీటర్ల డీజిల్ దొంగతనం జరగడంతో డీసీఎం యజమానికి డ్రైవర్లు సమాచారం అందించారు. దీంఓత యజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ కాలేజీకి దారేదీ..?

- ఇతరుల పట్టా భూమి నుంచి తాత్కాలిక రోడ్డు
- వర్షకాలంలో తీవ్ర ఇబ్బందులు పడు తున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బస్వాపూర్ రోడ్డు వద్ద మోడల్ తెలంగాణ జూనియర్ కాలేజీకి వెళ్లాలంటే దారి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశాలంగా అన్ని హంగుఆర్బాటాలతో రూ.కోట్ల నిధులతో కళాశాలను నిర్మించినా.. రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



కళాశాలకు వెళ్లే తాత్కాలిక రోడ్డు

కళాశాలను ప్రభుత్వ స్థలంలో నిర్మించినప్పటికీ దారి లేకుండానే భవన నిర్మాణాన్ని చేపట్టారు. పక్కనే ఉన్న కాలువ నుంచి కాలేజీ వరకు కాలినడకన వెళ్లేందుకు గుంతలమయంగా ఉన్న దారి వేశారు. కొన్నేండ్లుగా కొనసాగుతున్న క్రమంలో జుక్కల్ చౌరస్తా నుంచి జుక్కల్ వరకు రెండు వరుసల రోడ్డు వేసే క్రమంలో కాలువ పక్కన ఉన్న రోడ్డుకు అడ్డంగా బ్రిడ్జీ నిర్మాణం చేపట్టారు. దారి మూసుకుపోవడంతో విద్యర్థులకు ఇక్కట్లు మొదలయ్యాయి. దారిలేకపోవడంతో స్థానిక నాయకులు పట్టాభూమి లేదా ప్రభుత్వ భూమి తెలియని స్థలం మీదుగా నుంచి తాత్కాలికంగా రోడ్డును వేశారు. వర్షాకాలం వచ్చిదంటే విద్యార్థులు మోకాళ్లోతు నీరు, బురదలో నుంచి దాటి పోవాల్సిందేనని స్థానికులు అంటున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా కళాశాలకు పక్కా రోడ్డును నిర్మించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

- జడ్పీటిసి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రం నుంచి తాండూర్ మీదుగా మెదక్ జిల్లా పాపన్నపేట వరకు ఏర్పాటు చేసిన వంతెనను కలుపుతూ ఏర్పాటు చేసిన రోడ్డు నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని, గత ఐదు సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెడ్పిటిసి సభ్యులు మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం తాండూర్ మీదుగా ఏర్పాటు చేసిన వంతెనను, రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యంతో రోడ్డు నిర్మాణం మధ్యంతరంగా నిలిచిందని ఆయన అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే వంతెనను కలుపుతూ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.



పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఎమ్మెల్యేతో మల్కారెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డితో పాటు బాపునగర్ తాజా మాజీ సర్పంచ్ సునీత రవితోపాటు ఉప సర్పంచ్ కిరణ్, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి వారిని స్వాగతించారు. తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఎడపల్లి మండల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఎడపల్లి మండల పరిషత్, మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రామ్మోహన్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, ఎస్సీ సెల్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఈరెంటి లింగం, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు కారటూరి సత్యనారాయణ, పార్టీ నాయకులు కార్యకర్తలున్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు షురూ

- జానకంపేట్‌లో 25 వరకు కొనసాగనున్న ఉత్సవాలు


నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 19 నుంచి 25వ తేదీవరకు ఉత్సవాలు కొనసాగుతాయి. భక్తుల సౌకర్యం మేరకు ఆలయంలో కోనేరు వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు జాతర బ్రహ్మోత్సవాలలో పాల్గొంటారు. నరసింహస్వామి రెండు కొండల మధ్యన కొలువు తీరారు. గత కొన్నేండ్లుగా జాతర బ్రహ్మోత్సవాలను ఆలయ అధికారులు, పాలకవర్గం, అర్చకుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రారంభమైన జాతర ఉత్సవాలలో భాగంగా రోజువారీగా స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు నిర్వహిస్తారు. ఈ నెల 22న సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, 24వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు యజ్ఞం, రథోత్సవం, 25వ తేదీన చక్ర తీర్థం జాతర, జాతర ఉత్సవ కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ ఈవో వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు, పురోహితులు, అర్చకులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తుల సౌకర్యం మేరకు మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులు అత్యధికంగా విచ్చేసి జాతర బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. అష్టముఖి కోనేరు వద్ద, స్వామివారి ఆలయంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆలయ ఈవో వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు తెలిపారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యం మేరకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, జానకంపేట్ గ్రామానికి చెందిన పురం అబ్బయ్య అన్నదానం ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఆలయంవద్దగల అష్టముఖి కోనేరు

21న పూజా సామాగ్రి వేలంపాట



సలాబత్‌పూర్ ఆలయం

నవతెలంగాణ-మద్నూర్

దేవాదాయ ధర్మాదాయ శాఖ అధీనంలో కొనసాగుతున్న మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో పూజా సామాగ్రి అమ్మడానికి ఈనెల 21న ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వేలంపాటలో పాల్గొనే భక్తులు ముందుగా పదివేల రూపాయల డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డిపాజిట్ చేసిన భక్తులు మాత్రమే వేలంపాటలో పాల్గొనే అర్హత ఉంటుందని తెలిపారు. పూజసామగ్రి వేలంపాట రెండు సంవత్సరాల కాలపరిమితి ప్రకారం నిర్వహించబడుతుందని వివరించారు. వేలం పాటలో నెగ్గిన వారు వెంటనే 50శాతం డబ్బులు చెల్లించవలసి ఉంటుందని, మిగిలిన డబ్బులు 90 రోజుల్లో చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. గత ఏడాది పూజా సామాగ్రి అమ్మటానికి నాలుగు లక్షల 51 వేల రూపాయలు ఆలయానికి ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

నిజాలను నిర్భయంగా ప్రకటించే సత్తా రచయితలకే ఉంది

- తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

నిజాలను నిర్భయంగా ప్రకటించే సత్తా కవులకు, రచయితలకే ఉంటుందని సమాజంలోని అసమానతలను ఎత్తిచూపి ప్రజలను ఆలోచింపజేసే శక్తి అక్షరాలకే ఉందని, అలాంటి అక్షరాలను వస్త్రాలుగా మలచి నిరంతరం బహుకరిస్తున్న యోధుడు కవి, రచయిత ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక ప్రజా ఉద్యమాలకు భావజాల వ్యాప్తి చేసి భూమికగా నిలిచింది కవులు, రచయితల రచనలేనని తెలంగాణ రచయితల వేదిక తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి తెరవే జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్షక్ బీఈడీ కళాశాలలో ప్రముఖ కవి రచయిత అల్లి మోహన్ రాజ్ రాసిన అమ్ముల పొది కవితా సంపుటి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని నిరంతరం చైతన్యం చేస్తూ అనేక సామాజిక రుగ్మతలకు పరిష్కారం చేసే ఆలోచనలను కవి చేస్తాడని అందుకే రచయితలు నిరంతరం ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రజల పక్షాన నిలబడతారని, అలాంటి రచనలే శాశ్వతంగా నిలబడతాయని భావితరాలను ప్రభావితం చేస్తాయని, కవులు రచయితలు నిరంతరం అధ్యయనం చేస్తూ అన్వేషిస్తూ రచన వ్యాసంగాని కొనసాగించాలని, తెలంగాణ రచయితల వేదిక గత రెండు దశాబ్దాల కాలంగా ప్రజాపక్షం వహిస్తూ సమాజాన్ని నిరంతరం చైతన్యం చేస్తున్నదని అన్నారు. అల్లి మోహన్ రాజ్ రాసిన అమ్ములపొది కవితా సంపుటిలోని కవితలు మనసును గాయం చేస్తాయని, మంచి మార్పు కోసం నిలబడతాయని కవితల్లోని భావాలు మనందరినీ ఆకట్టుకుంటూ ఆలోచింపచేస్తాయని, ఈ పుస్తకంలో అనేక సామాజిక అంశాలపై ఆలోచింపచేసే విధంగా కవితలు ఉన్నాయని, పుస్తక రచయిత అల్లి మోహన్ రాజ్‌ను అభినందించారు. తెరవే జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతను పెంచే క్రమంలో మోహన్ రాజ్ రాసిన కవితలు ఉపయోగపడతాయన్నారు. కవి రాసిన పుస్తకంలో ఎన్నో ఆలోచననీయమైన కవితలు ఉన్నాయన్నారు. పర్కపల్లి యాదగిరి పుస్తకాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా విచ్చేసిన సెన్సార్ బోర్డు సభ్యులు డాక్టర్ నర్ల రామకృష్ణారెడ్డి, ప్రముఖ గజల్ రచయిత సూరారం శంకర్, మాట్లాడుతూ.. పుస్తకం నిండా చైతన్యపరిచే కవితలు సమాజాన్ని ఆలోచింపచేస్తాయన్నారు. తెలంగాణ రచయితల వేదిక బాధ్యులు కవులు గంగాప్రసాద్, పీతాంబర్, నాగభూషణం, రామచంద్రం, సుప్పని సత్యనారాయణ, సిరిగాద శంకర్, రుద్రాంగి రమేష్, లింగం, సాయిలు, రచయిత బంధువులు మిత్రులు పాల్గొన్నారు. అనంతరం కవి అల్లి మోహన్ రాజ్‌ను అభినందించారు.




కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయితలు

నిజాంసాగర్ కెనాల్ పూడికతీత పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని కొత్తపల్లి క్యాంపులో బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఏనుగు రవీందర్‌రెడ్డి సహకారంతో కొత్తపల్లి క్యాంపులో నిజాంసాగర్ 27వ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ పూడికతీత పనులను ఆదివారం ప్రారంభించారు. నిజాంసాగర్ 27 డిస్ట్రిబ్యూటర్ కెనాల్‌లో పూడిక పెరిగిపోవడంతో స్వచ్ఛందంగా ఈమధ్య రైతుల కోరిక మేరకు కెనాల్‌ను ఏనుగు రవీందర్‌రెడ్డి పరిశీలించి పూడిక తొలగిస్తానని హామీ ఇవ్వడంతో ఆదివారం పనులు ప్రారంభం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి సెక్రెటరీ కొండారెడ్డి, వార్డ్ మెంబర్ రమణారెడ్డి, దేవుని గుట్ట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కొర్ర జైపాల్, కేతావత్ రవి, కోటిరెడ్డి, అట్లా సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, ఆర్.కృష్ణారెడ్డి, గ్రామపెద్దలు పాపిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



జేసీబీతో పూడికతీత పనులు

నేడు ఐలాపూర్‌లో శివాజీ విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ చేపట్టనున్నట్టు ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతిని పురస్కరించుకొని ఐలాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 19న సాయంత్రం 6 గంటలకు ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్టు పేర్కొన్నారు. అదేవిధంగా లింగంపేట్ మండల కేంద్రం నుంచి ఐలాపూర్ వరకు సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

కందకుర్తి గోదావరిలో భక్తుల తాకిడి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో ఆదివారం పుణ్య స్నానాలను ఆచరించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్నానాలను ఆచరించి గోదావరి మధ్యలో ఉన్న రాతి శివాలయంపైకి తేలడంతో పూజలు చేశారు. అనంతరం గోదావరి తీరాన గల ఆలయాలను వారు సందర్శించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ముప్కాల్



ముప్కాల్ జాతీయ రహదారి-44 బైపాస్ రోడ్డుపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. మండల కేంద్రానికి చెందిన కుర్మ మేకల సాయన్న ద్విచక్ర వాహనంపై బైపాస్ క్రాస్ రోడ్డును దాటుతున్నాడు. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీ కొట్టడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. బైపాస్ రోడ్డుకు ఇటీవల అండర్ బ్రిడ్జి మంజూరైనట్లు స్థానికులు చెబుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు బ్రిడ్జి పనులు తొందరగా మొదలు పెట్టాలని కోరుతున్నారు. లేదంటే ఇలాంటి రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతాయని అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బైపాస్ రోడ్డుపై అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ కు చెందిన గడ్డం లింబాద్రి పనిమీద ద్విచక్ర వాహనం పై డిచ్ పల్లి మండలంలోని ముల్లంగి గ్రామానికి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన ఇంటికి వెళ్తుండగా ముల్లంగి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీ కొంది. ఈప్రమాదంలో లింబాద్రి అక్కడికక్కడే మృతి చెందిఎస్సై మహేష్ తెలిపారు. మృతుని భార్య గడ్డం జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి మార్చురీకి తరలించినట్లు ఎస్సై వివరించారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డి కుమారుని వివాహం

హాజరైన జిల్లా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు



వివాహానికి హాజరైన ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

రూరల్ శాసన సభ్యులు డా. భూపతి రెడ్డి కుమారుడు స్నేహిత్ - రిక్షిత వివాహ వేడుకకు హైదరాబాద్‌లో ఆదివారం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడ్డి గార్లతో కలిసి కాంగ్రెస్ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మోపాల్:నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కుమారుడు వివాహం హైదరాబాద్‌లో ఆదివారం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. మండలం నుండి పెద్ద మొత్తంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, ముప్పగంగ రెడ్డి, సూర్య రెడ్డి శేఖర్ గౌడ్, బోడ మహేందర్, సురేష్ నాయక్ తదితరులు హాజరయ్యారు.

హస్తం గూటికి బీఆర్ఎస్ మార గంగారెడ్డి ?

నవతెలంగాణ-ఆర్మూర్



మార గంగారెడ్డి

రాష్ట్ర మార్క్ ఫైడ్ చైర్మన్ మార గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మల్యాల నర్సారెడ్డి హస్తం గూటికి చేరనున్నారు. మండలంలోని అంకాపూర్ స్వగ్రామానికి చెందిన మార గంగారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత సన్నిహి తులుగా ఉన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది.

జిల్లా యూత్ సీనియర్ నాయకులు



జిల్లా యూత్ సీనియర్ నాయకులు మల్యాల నర్సారెడ్డి హస్తం గూటికి చేరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన మల్యాల నర్సారెడ్డి 2014 నుండి 18 వరకు మండల యూత్ అధ్యక్షునిగా ఆ తర్వాత జిల్లా యూత్ నాయకునిగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి అత్యంత సన్నిహితునిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు వినయ్ రెడ్డి సైతం సన్నిహితులుగా ఉండేవారు. దీంతో ఆయన పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ప్రతి ఒక్కరూ లక్ష్యం వైపే అడుగులు వేయాలి

- గొప్ప వ్యక్తులను రోల్ మోడల్ గా తీసుకోవాలి
- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రతి ఒక్కరూ లక్ష్యం వైపే అడుగులు వేయాలని, గొప్ప వ్యక్తులనురోల్ మోడల్‌గా తీసుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి అన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆర్య వైశ్య గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో దిక్సూచి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమ ముఖ్య వక్తగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని ఎంచుకోవాలని, దానివైపు అడుగులు వేయాలని, ఎన్ని అడ్డంకులు వచ్చిన ఎంచుకున్న లక్ష్యం వైపు మాత్రమే గురి ఉండాలని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తు ప్రణాళికను ముందుగా సిద్ధం చేసుకుని చక్కగా రూపకల్పన చేసుకున్నప్పుడే రాణించగలుగుతారని తెలిపారు. భవిష్యత్తు బంగారు మయం కావాలన్న, బాగుండాలన్నా వర్తమానంలో కష్టపడాలని చదివితే ఉన్నత శిఖరాలు అదిరోహించవచ్చని అన్నారు. ఇప్పుడు ఎలాంటి బాటలు వేసుకుంటే భవిష్యత్తులో అలాంటి దారిపై నడిచే అవకాశం ఉంటుందని, మంచి బాటను ఎంచుకున్నప్పుడే లక్ష్యం తొందరగా నెరవేరుతుందన్నారు. అనంతరం అమ్మ నాన్నల విలువలను చక్కగా వివరించారు. ఒక విద్యార్థి తన జీవితంలో రోల్ మోడల్‌గా తీసుకోవలసిన గొప్ప వ్యక్తులైన స్వామి



శ్రీహరిని సన్మానిస్తున్న పలువురు

వివేకానంద, అబ్దుల్ కలాం, సోమనాథ్, అరుణిమ సింహ తదితరుల జీవిత చరిత్రను వివరించారు. జీవితంలో విజయం సాధించడానికి కావాల్సిన ఏబీసీడీ ఫార్ములా గురించి ఎంతో చక్కగా వివరించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహా సభ జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చు పురుషోత్తం గుప్త, వాసవి సేవ దళ్ ప్రెసిడెంట్ మహంకాళి విజయ్ కుమార్, బ్రహస్‌పల్లి బల్దాస్ గుప్తా అడహాక్ కమిటీ మాజీ ఎన్నికల అధికారి, ఆర్య వైశ్య గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, అధ్యక్షులు కూట్ల నవీన్, డా.గందె శ్రీనివాస్ గుప్త, బాలకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన హెూంగార్డు

- అభినందించిన పోలీసు సిబ్బంది



గోపాల్‌ను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పోలీస్ స్టేషన్‌లో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పోతున్నర్ గ్రామానికి చెందిన కుసునూరు గోపాల్ కానిస్టేబుల్ శిక్షణ నిమిత్తం వెళుతున్న సందర్భంగా పోలీస్ స్టేషన్ బృందం ఆయను అభినందించారు. ఈసందర్భంగా ఎస్ఐ జి. రమేష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సిరికొండ మండల కేంద్రంలో ఉత్తమ సేవలను అందించిన హెూమ్ గార్డ్‌కు కానిస్టేబుల్ ఉద్యోగం రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఉన్నత స్థాయిలో ఉండాలని, మరెన్నె సేవలను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాల్‌సింగ్, మధుకర్, కరుణ, గౌతమి, సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ జీవన్ శంకర్, నవీన్, హరీష్, దేవేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశాలకు కోటపాటికి ఆహ్వానం

- సమావేశానికి అబుదాబి వెళ్లనున్న ఆర్మూర్‌వాసి



నవతెలంగాణ ఆర్మూర్

ఈనెల 26 నుండి 29 వరకు యూఏఈ లోని అబుదాబిలో జరగనున్న 13వ మంత్రుల స్థాయి సమావేశాలకు ఎన్జీవో కోటాలో ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక, అధ్యక్షులు కోటపాటి నర్సింహం నాయుడు ప్రతినిధిగా పాల్గొని చర్చలలో భాగస్వామి కావాలని ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆదివారం కోటపాటి మాట్లాడుతూ.. భారతదేశంతో సహా 164 సభ్య దేశాల వాణిజ్య మంత్రులు, వివిధ రంగాల ఆర్థిక నిపుణులు ఈ సమావేశాలలో పాల్గొని 4 రోజులపాటు ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య సహకారం, ఎదురయ్యే సమస్యలపై కులంకాశంగా చర్చించనున్నారని తెలిపారు. భారతదేశంలోని ఎన్జీవో, రైతు సంఘాల ప్రతినిధులను కూడా ఆహ్వానించగా కోటపాటిని దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుని హెూదాలో ఆహ్వానించడం విశేషం. తెలంగాణ నుండి కోటపాటితో పాటు కర్ణాటక నుండి కె శాంత కుమార్ , కేరళ నుండి కె.వి బిజ్జుతో కలిసి ఈనెల 24న అబుదాబికి వెళ్లనున్నట్టు తెలిపారు. కోటపాటి నరసింహ నాయుడు మూడు శతాబ్దాలుగా స్వదేశీ ఆందోళన ఉద్యమకారుని హెూదాలో ఈ ఆహ్వానం అందింది. సదస్సుకు తెలంగాణ నుండి ఒక్కరినే ఆర్మూర్ వాసిని ఎంచుకోవడం విశేషం.ప్రపంచ వాణిజ్య సంస్థలో అభివృద్ధి చెందుతున్న భారత్ చేరడం వలన మన దేశంలోని చిన్న పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తులు మరియు కుటీర పరిశ్రమలు దెబ్బతింటున్నాయని కోటపాటి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని గాయత్రి నగర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. క్యాసారపు నాగరాజు (57) పూలాంగ్ వైపునుండి ద్విచక్రవానంపై నాగారంలోని తన ఇంటి వైపు వెళ్తున్నాడు. అదే దిశలో వస్తున్న ఒక ప్రైయివేట్ బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా రావడంతో ద్విచక్రవానంను ఢీకొట్టారు. ఈప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మరణించాడు. బస్సు డ్రైవర్ పరారిలో ఉన్నాడు.



నాగరాజు మృతదేహం

మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

నవతెలంగాణ-ఆర్మూర్

రాబోయే ఎన్నికల దృశ్యా ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తోంది. ఇందులో భాగంగా పట్టణ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీఐ వెంకటస్వామి బదిలీ అయ్యారు. ఇక్కడ మూడు సంవత్సరాల వరకు విధులు నిర్వహించారు.

కొత్తిమీర సాగుతో ఆదాయం

- లాభాలు గడిస్తున్న రైతు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రస్తుతం మార్కెట్లో సాంప్రదాయ పంటలపై ఆదాయం అంతంత మాత్రమే వస్తుండడం సాగువ్యయాలు అధికం కావడంతో రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల పట్ల ఆసక్తి చూపుతున్నారు. తమ నేల రకాలకు అనువుగా ఉంటూ మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.. జిల్లాలోని వ్యవసాయంలోనే పేరుపొందిన వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ తదితర గ్రామాలలో గత కొన్ని సంవత్సరాల నుండి రైతులు కొత్తిమీర పంటను సాగు చేస్తున్నారు. రెండు మాసాలలో ఈ పంట చేతికి వస్తుంది. కొత్తిమీర పంటను విక్రయించి దాని ద్వారా వచ్చిన డబ్బుల్ని ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు పెట్టుబడి కోసం ఇక్కడి రైతులు ఉపయోగిస్తారు..

ఆదర్శంగా నిలుస్తూ..

ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా పదవ తరగతి చదివిన ఓ యువకుడు స్వశక్తితో కొత్తిమీర పంట సాగు చేసి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. జక్రాన్‌పల్లి మండలంలోని లక్ష్మాపూర్ తండాకు చెందిన దినేష్ అనే యువరైతు గత నాలుగు సంవత్సరాల నుండి కొత్తిమీర పంట సాగు చేస్తున్నాడు. నాలుగు ఎకరాల్లో సాగు చేస్తుండగా ఎకరానికి 11వేలు ఖర్చు అవుతుంది. జిల్లా కేంద్రంలోని మార్కెట్లో కిలో కు 30 రూపాయల చొప్పున అమ్ముతూ లాభాలు గడిస్తున్నాడు. ఆర్మూర్ పట్టణానికి చెందిన శ్రీ ఆదిత్య ఆగ్రో ఏజెన్సీస్ వారి ఇండస్ కొరియాండల్ రోషిని అనే వెరైటీ సీడ్స్‌తో లాభాలు గడిస్తూ రైతంగానికి ఆదర్శంగా నిలిచాడు.



సాగుచేసిన కొత్తిమీర

కష్టపడితే లాభాలు..



కష్టపడే తత్వం ఉండబట్టే గత కొన్ని సంవత్సరాల నుండి కొత్తిమీర సాగు చేస్తున్న. వ్యవసాయ అధికారులు, పట్టణానికి చెందిన భాస్కర్ సీడ్స్ చేపూర్ శ్రీధర్ సూచనలు సలహాల మేరకు కొత్తిమీర పంట సాగు చేస్తున్నా

దినేష్, యువరైతు, లక్ష్మాపూర్ తండా

జిల్లాస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో సత్యశోధక్ విద్యార్థుల విజయభేరి



పోటీల్లో ప్రతిభ కనబరిచిన సత్యశోధక్ విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలలో సత్యశోధక్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారని పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య ఆదివారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు జిల్లా విద్యాధికారి యన్‌వి. దుర్గా ప్రసాద్, ట్రస్మా రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా అధ్యక్షులు యస్. జయసింహాగౌడ్ లు ప్రత్యేక బహుమతులు అందించి అభినందించారు. అబాకస్ వివిధ విభాగాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు టి. శివాని, యన్. కార్తీక, కె.అనన్య పాటిల్, వి. సాద్వి లు ఛాంపియన్ షిప్, వేదిక్ మ్యాథ్స్ వివిధ విభాగాలలో పి. యశ్వంత్, వి. వైశ్విక, పి. నవ్యశ్రీ ఛాంపియన్ షిప్ సాధించారు. వీరితో పాటు జి. శ్రీశాంత్, యస్. అవంతిక, కె నిత్యశ్రీ, హంజాల, వై.సంకేత్, టి. దీక్షిత లు ప్రోత్సాహక బహుమతులు పొందారు. సృజనాత్మకత, జ్ఞాపకశక్తి మెరుగు పడుటకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర సలహాదారులు ఎం. మోహన్, నగర అధ్యక్షులు నాగరాజు విశ్వం ఎడ్యుటెక్ ప్రతినిధులు మారుతి, వినాయక్, శివ, పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, సతీష్, పూజిత్ పాల్గొన్నారు.

కేజీబీవికి ప్రహరీ లేక ఇక్కట్లు

- రక్షణ లేక భయాందోళనలో విద్యార్థినులు
- ప్రహరీకోసం పిల్లర్లు పోసి వదిలేసిన వైనం

నవతెలంగాణ-మాక్లూర్

విద్యార్థినులు అడుకుందామంటే పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు. ఈ కేజీబివిలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 222 విద్యార్థినులు, ఇంటర్‌లో 120 విద్యార్థినులు ఉన్నారు.

కళాశాల మిగులు నిధులతోనే పిల్లర్లు..

ఇంటర్ కళాశాల బిల్డింగ్ నిర్మించి నప్పుడు మిగులు నిధులతోనే ప్రహరీ పిల్లర్లు వేశారు. నిధులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. విద్యార్థినులు ఆడుకోవడానికి అట స్థలం లేక ఇబ్బందులను ఎదుకొంటున్నారు. హాస్టల్‌లో అదుకుందామంటే మధ్యలో రాళ్ళు ఉన్నాయి. దెబ్బలు తగులుతాయని ఇబ్బందులు పడుతున్నారు.



పిల్లర్లువేసి వదిలేసిన పనులు

కోతులు, పాముల బెడద...

కస్తూర్బా పాఠశాల అవరణలో కోతుల బెడదతో విద్యార్థినిలు, అధ్యాపకులు సైతం బెంబేలు పడుతున్నారు. విద్యార్థినిలు స్నాక్స్ తీసుకొని బయటకు రాగానే వారి వెంట పడుతున్నాయి. వాటిని ఎక్కడికైనా తీసుక వెళ్ళమని పాఠశాల సిబ్బంది అటవీశాఖ అధికారులను కోరగా కోతులు అతవిలో కాకుండా ఎక్కడ ఉంటాయని నిర్లక్ష్యపు సమాధానం చెపుతున్నట్లు తెలిపారు. పాములు పాఠశాల అవరణంలో అపుడప్పుడు కనిపిస్తున్నాయి. కాబట్టి కస్తూరిబా పాఠశాలకు ప్రహరీ నిర్మిస్తే బాగుంటుందని, హాస్టల్‌లో రాళ్ళను తొలగించాలని విద్యార్థినిలు, అధ్యాపకులు కోరుతున్నారు.

స్మార్ట్ సిటీలో యువకుడు దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నగర శివారులోని న్యాల్కల్ రోడ్‌లో గల స్మార్ట్ సిటీ వెంచర్‌లో చోటుచేసుకుంది. నగరంలోని సీతారాం నగర్ కాలనీకి చెందిన శ్రవణ్ కుమార్ (35) ఖలీల్వాడిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్ గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకు డ్యూటీలోనే ఉన్నట్టు తెలిసింది. మద్యం మత్తులో ఈ ఘర్షణ జరిగిందని సమాచారం. ఘటనా స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట రెడ్డి, నార్త్ రూరల్ సీఐ సతీష్, ఐదవ టౌన్ ఎస్సై అప్పారావులు పరిశీలించారు. శ్రవణ్ కుమార్‌తో రాత్రి మద్యం సేవించింది ఎవరు.. హత్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

రోడ్లపైనే ధాన్యం

- వాహనదారుల ఇక్కట్లు

నవతెలంగాణ ఆర్మూర్

పంట ఎండబెట్టుకోవడానికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో నియోజకవర్గంలోని పలు మండలాలలోని వివిధ గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ప్లాట్ ఫామ్ ల నిర్మాణాలు కొన్నిచోట్ల నిర్మించినారు . వ్యవసాయ రంగంలో ఆర్మూర్ ప్రాంతంలోని రైతులు అత్యధికంగా పంటలు పండిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కానీ ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఆరబెట్టేందుకు రైతులు రోడ్లనే వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వాలు రైతును రాజును చేస్తామని గొప్పలు చెప్పడమే కానీ ఆచరణలో చూపడం లేదని,,, గత ప్రభుత్వం మొదలుకొని ప్రస్తుత ప్రభుత్వం శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.. మండలంలోని గోవింద్ పెట్ నుంచి భీంగల్ వెళ్లే దారిలో గల రోడ్డుపై జొన్నలు ఆరబెట్టడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. గత కొన్ని సంవత్సరాల క్రితం సాయి పేట గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. నందిపేట మండల కేంద్రంలోని ఒకరిద్దరూ మృత్యువాత పడ్డారు.

..... వన్ వే గా మారిన రోడ్లు....

ఒకవైపు పంటలను ఆరబోసి మరోవైపు వాహనాలు వెళ్లేందుకు వదులుతున్నారు .దీంతో ఈ రోడ్లు వన్వేగా మారుతున్నాయి. ఇలా రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పంటకు రక్షణగా రోడ్డుపై పలు చెక్కలు రాళ్లను అడ్డంగా పెడుతుంటారు. రాత్రివేళలో ప్రయాణికులు వాటిపై వాహనాలు ఎక్కించగా మృతి చెందిన ఘటనలు ఉన్నవి. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ప్రతి గ్రామంలోనూ ప్లాట్ఫార్మ్ నిర్మాణాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



రోడ్డుపై ఆరబోసిన జొన్నలు

వివాహ వేడుకల్లో పాల్గొన్న మల్లికార్జున్ రెడ్డి



హాజరైన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన రాధారపు గంగసాయన్న కుమారుని వివాహం ఆదివారం జరిగింది. ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ బిజెపి నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మండల బిజెపి అధ్యక్షులు కట్ట సంజీవ్, తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)/మద్నూర్

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే భూపతిరెడ్డి కుమారుడి పెండ్లి వేడుకలకు ఆదివారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్‌మోహన్‌రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. హైదరబాద్ కొంపల్లి జెన్వి కన్వెన్షన్ నందు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కుమారుడు స్నేహిత్ వివాహం జరిగింది. ఈ శుభకార్యానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో మంత్రులతో పాటు పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు.

మద్నూర్ : హైదరాబాద్‌లో జరిగిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి కుమారుడి పెండ్లి వేడుకల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పెండ్లి వేడుకకు హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జానారెడ్డిని, అలాగే చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఎమ్మెల్యే కలిశారు.

ఇంటర్ విద్యార్థులకు నేడు పర్యావరణ పరీక్షలు

- ప్రిన్సిపాల్ నరేందర్


నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు సోమవారం పర్యావరణ పరీక్షను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు రికార్డ్స్, హాల్‌టికెట్లతో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పర్యావరణ పరీక్షకు గైర్హాజరైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో వార్షిక పరీక్షల్లో పాల్గొన్న ఉత్తీర్ణత ఫలితాలు రావని తెలిపారు.

టికెట్‌కు పోటాపోటీ..

జహీరాబాద్ టికెట్ కోసం ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు

- ఎవరికి వారు కార్యక్రమాలు చేసుకుంటూ ప్రజల్లో ఉండే ప్రయత్నం
- సర్వేలను నమ్ముకున్న ప్రధాన పార్టీలు
- పరిశీలనలో అభ్యర్థి ఆర్థిక, అంగ బలం



వేసవితో పాటు పార్లమెంట్ ఎన్నికల వేడీ రాజుకుంటుంది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టికెట్ కోసం ప్రధాన పార్టీల నుంచి ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆయా పార్టీల అధిష్టానం దృష్టిలో పడేందుకు ప్రజల్లోకి వెళు_న్నారు. నువ్వానేనా అన్నట్టు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే పార్టీలు సైతం ఆచీతూచీ వ్యవహరిస్తున్నాయి. ప్రధానంగా సర్వేలు చేపట్టడంతో పాటు అభ్యర్థి ఆర్థిక, అంగ బలం పరిశీలిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా.. పార్లమెంట్ సిట్టింగ్ సీటును మరోసారి కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్ పావులు కదుపుతుంది. అయితే గత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 6 వేల ఓట్ల తేడాతో కాంగ్రెస్ పార్టీ సీటు కోల్పోగా.. ఈసారి ఖచ్చితంగా కైవసం చేసుకోవాలనే ప్లాన్ వేస్తుంది. దీంతో పాటు బీజేపీ సైతం పార్లమెంట్ సీటుపై కన్నేసింది.

నవతెలంగాణ-లింగంపేట్

పార్లమెంట్‌కు సంబంధించి ఎన్నికల షెడ్యూలు త్వరలో రానున్నట్టు సమాచారం వస్తుంది. ఎప్రిల్ చివరి నాటికి పార్లమెంట్ ఎన్నికలు ముగుస్తాయని ఇటీవల కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొనడం గమనార్హం. ఈ నేపథ్యంలో జహీరాబాద్ సీట్ కైవసం కోసం ప్రధాన పార్టీలు హ్యూహాలు పన్నుతున్నాయి. ఇన్‌చార్జీలను సైతం నియమించి కార్యకర్తలను బలోపేతం చేయడంలో నిమగ్న మయ్యాయి. గత కొన్ని రోజులుగా జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీ బిజెపి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి కార్యకర్తలను బలోపేతం చేస్తున్నారు. మరోవైపు బలమైన అభ్యర్థులను రంగులకు దించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా.. ఆశావాహులు అధికం కావడంతో ఢిల్లీ స్థాయి నాయకులతో ఆశావాహులు రాష్ట్ర నాయకులతో కలసి తమకే టిక్కెట్లు ఇవ్వాలని కోరడంతో ప్రధాన పార్టీల్లో ఆశావాహుల నుంచి డిమాండ్ నెలకొంది.

రహస్య సర్వేలు

ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం రహస్యంగా సర్వేలు చేస్తున్నట్లు తెలిసింది. సర్వేల ఆధారంగా బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ప్రధాన పార్టీలు దృష్టి పెడుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డిని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నెల రోజుల క్రితమే ప్రకటించింది. సుదర్శన్ రెడ్డి అదే పనిలో నిమగ్నమయ్యారు.

హస్తంలో టికెట్ ఎవరికి దక్కేనో..?

అధికార కాంగ్రెస్ పార్టీ ఈసారి జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. గత పార్లమెంట్ ఎన్నికలలో 6000 ఓట్ల స్వల్ప మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోయారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో జహీరాబాద్‌పై ఫోకస్ పెట్టింది. రెండుసార్లు జహీరాబాద్ పార్లమెంట్ స్థానం బిఆర్ఎస్ గులాబీ జెండా ఎగరవేసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎవరికి టిక్కెట్టు వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది. మాజీ ఎంపీ సురేష్ షెట్కర్‌తో పాటు మరికొంత మంది నాయకులు టికెట్టు ఆశిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిచే అభ్యర్థులను బరిలోకి దించేందుకు కసరత్తు చేస్తుంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఐదు స్థానాలు కైవసం చేసుకుంది. ఇదే ఊపుతో జహీరాబాద్ స్థానంపై గురి పెట్టింది.

కమలంలో ఆశావహులు అధికం

జహీరాబాద్ పార్లమెంటు బరిలో ఉండేందుకు భారతీయ జనతా పార్టీలో చాలామంది టిక్కెట్లు ఆశిస్తున్నారు. ఇప్పటికే ఆశావహులు పోటాపోటీగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఒక పక్క ఢిల్లీ, రాష్ట్రస్థాయి నాయకులతో మంతనాలు చేస్తూనే మరొ పక్క స్థానికంగా సామాజిక కార్యక్రమాలతో ఉత్సవాలు, క్రీడలు, పరామర్శలు, సన్మానాలు, ఆర్థిక సాయంతో పాటు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తాడ్వాయి మండలానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఇప్పటికే జహీరాబాద్ పరిధిలో సామాజిక సేవ కార్యక్రమంలో ముందున్నారు. ఆందోల్ నారాయణఖేడ్ జహీరాబాద్ నియోజకవర్గాల్లోనే అధిక సమయం కేటాయి స్తూ తమకున్న పరిచయాలతో ముందుకు సాగుతున్నారు. మార్పు కోసం ఒక్క అడుగు పేరుతో ప్రచారం చేపడుతున్నారు. అదేవిధంగా ఉస్మానియా ఆస్పత్రి ప్రొఫెసర్ సామాజిక సేవా కార్యకర్త గాంధారి మండలం లోని రామలక్ష్మి పల్లి తాండకు చెందిన గిరిజన కుటుంబానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రామ్ సింగ్ టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నం చేశారు. మాజీ ఎంపీ బాగా రెడ్డి కుమారుడు జయపాల్ రెడ్డి గాంధారి మండల కేంద్రంలో క్రీడలు నిర్వహించారు. యువకులను తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. అదేవిధంగా మాజీ ఎంపీ ఆలే నరేంద్ర కుమారుడు ఆలే భాస్కర్ గత కొన్ని సంవత్సరాలుగా పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయన టికెట్ ఆశిస్తున్నారు. ఎల్లారెడ్డి నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన బాణాల లక్ష్మారెడ్డి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి హైకోర్టు న్యాయవాది నాగిరెడ్డిపేట్ మండల కేంద్రానికి చెందిన రచన రెడ్డి బిచ్కుంద మఠాధిపతి సోమయ్య అప్ప కామారెడ్డికి చెందిన చక్రవర్తి గౌడ్ మేడపాటి ప్రకాశ్ రెడ్డి పైలా కృష్ణారెడ్డి పలువురు టికెట్ ఆశిస్తున్నారు.

గులాబీలో ఆశావహులు

గులాబీ పార్టీలో జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ పలువురు ఆశిస్తున్నారు. సిట్టింగ్ ఎంపి బిబి పాటిల్ రెండు పర్యాయలుగా గెలిచారు. గులాబీ జెండా ఎగరవేశారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మంచి పట్టుంది. ఆయన చేసిన సేవా కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలతో ముందు వరుసలో ఉన్నారు. అయితే ఈసారి మహారాష్ట్ర నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్టు స్థానికంగా చర్చలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి ఆయన చేపట్టిన పనులను వివరించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలను ఉత్తేజపరిచారు. మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కుమారుడు ఉమ్మడి జిల్లాల డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఈసారి జహీరాబాద్ టిక్కెట్టు ఆశిస్తున్నట్లు సమాచారం. ఆ వార్తలకు బలం చేకూర్చేలా.. ఇటీవల జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండల కేంద్రంలో నియోజకవర్గస్థాయి సమావేశం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంతో పోచారం భాస్కర్ రెడ్డిని బరిలోకి దింపే ప్రయత్నాలు జరుగుతున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ నెలకొంది. అదేవిధంగా కామారెడ్డి నియోజకవర్గం బిబిపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సుభాష్‌రెడ్డి సైతం టికెట్టు ఆశిస్తున్నట్లు తెలిసింది. కామారెడ్డి అసెంబ్లీ టికెట్ ఆశించినప్పటికీ అధిష్టానం సూచనతో బరిలో నిలవలేదు. అయితే ఈసారి జహీరాబాద్ టికెట్ ఆశిస్తున్నారు. ఏదేమైనప్పటికీ అన్ని పార్టీలు సైతం సర్వేలను నమ్ముకున్నాయ. సర్వేల్లో వచ్చే రిపోర్టుల ఆధారంగానే అభ్యర్థులను దించేందుకు కసరత్తు చేస్తున్నాయి.


రాజీనామా యోచనలో అమ్దాపూర్ సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం అమ్దాపూర్ సొసైటీ చైర్మన్ గిర్దావర్ గంగారెడ్డి త్వరలో సొసైటీ పదవికి రాజీనామా చేయనున్నట్లు సమాచారం. గత నాలుగు రోజుల క్రితం ఆయనపై సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసం తీర్మానానికి జిల్లా సహకార సంఘం అధికారికి నోటీస్ ఇచ్చారు. దాంతో మండలంలో ఈ అవిశ్వాస తీర్మానంపై ఆసక్తి నెలకొంది. సొసైటీ చైర్మన్ పదవి పోతే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ పదవిని కూడా ఆయన కోల్పోవలసి వస్తుంది. అయితే తన పదవికి ముప్పు రాకుండా ఆయన బోధన్ ఎమ్మెల్యే మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డిని ఆశ్రయించినట్లు సమాచారం. ఆయన వద్ద జరిగిన చర్చలో డైరెక్టర్ల కోరిక మేరకు రాజీనామా చేయవలసిందేనని చెప్పినట్లు సమాచారం. దీంతో గిర్దావర్ గంగారెడ్డి వారం రోజుల్లోగా తన పదవికి రాజీనామా చేయనున్నట్లు సమాచారం. తదనంతరం బీఆర్ఎస్ పార్టీలో ఉంటారా లేక కాంగ్రెస్ పార్టీలో చేరుతారా అనేది ఆయన నిర్ణయంపై ఆధారపడి ఉంది. ప్రస్తుతం బోధన్‌లో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ లేకపోవడం, దిశానిర్దేశం చేసేవారు లేకపోవడంతో పార్టీ కార్యకర్తలు నామమాత్రంగా మిగిలిపోయారు. గత వారం క్రితం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రజితాయాదవ్, ఎడపల్లి మండలానికి సంబంధించిన మరికొంతమంది నాయకులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాంతో బోధన్ మండలంలో సైతం బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి మార్గం సుగమం చేసుకుంటున్నట్లు ప్రచారం. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నాయకులు హడావిడిగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించేవారు. కానీ శనివారం జరిగిన కేసీఆర్ పుట్టినరోజు వేడుకల సందడి ఎక్కడ కనబడలేదు. బోధన్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవీందర్ యాదవ్, రవిశంకర్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగారం వీళ్ళు మాత్రమే కేసీఆర్ బర్త్‌డే వేడుకలు నిర్వహించి ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అలాగే సొసైటీ డైరెక్టర్ సాయిపటేల్ కెసిఆర్ బర్త్‌డే నిర్వహించారు. కానీ సాలూరు మండల కేంద్రంలో, చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కడ కూడా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించలేదు. దాంతో బోధన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారా లేరా అనే అనుమానం కలుగుతుంది. ఇదే క్రమంలో బీఆర్ఎస్ పార్టీలో ముఖ్య భూమిక పోషించి, ఎమ్మెల్యే రేసులో పేరు సాధించిన అమ్దాపూర్ సొసైటీ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ గంగారెడ్డి రాజకీయ భవిష్యత్తుపై అంతట ఆసక్తి నెలకొంది. చివరికి బోధన్ బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు ఎటువైపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

అందని 'డబుల్' ఇండ్లు

- గృహలక్ష్మి కాగితాలకే పరిమితం
- ఆందోళనలో లబ్దిదారులు



నవతెలంగాణ-లింగంపేట్

గత ప్రభుత్వం పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 'డబుల్ బెడ్‌రూం' పథకాన్ని ప్రారంభించింది. కానీ పూర్తిస్థాయిలో లబ్దిదారులకు ఇండ్లను పంపిణీ చేయలేదు. అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు గృహలక్ష్మి పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. దీంతో నిరుపేదలు గృహలక్ష్మీ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాని అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

గృహలక్ష్మి కాగితాలకే..

కామారెడ్డి జిల్లాలో ఆయా మండలాల పరిధిలో 31,100 మంది ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తులు దారుల వద్దకు వెళ్లి పరిశీలించారు. 22 మండలాల పరిధిలో గృహ లక్ష్మీ దరఖాస్తులను పరిశీలించి 26,040 మంది లబ్దిదారులను గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. గ్రామాల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఆన్లైన్లో నమోదు చేశారు. లబ్దిదారుల జాబితాను సైతం సిద్ధం చేసి మంజూరు పత్రాలు ఇవ్వడానికి సిద్ధం చేశారు. నవంబర్ 2023లో అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో ఎన్నికల కోడ్ ఉండడంతో ప్రభుత్వం మారడంతో గృహలక్ష్మి కాగితాలకే పరిమితమైపోయింది.

ఇల్లు నిర్మించుకున్నా.. రాని బిల్లులు..

గత ప్రభుత్వం పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు మంజూరు చేస్తామని హామీనివ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు, ఇండ్లు లేని వారు, నివాస గుడిసెలో ఉన్నవారు డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం కొరకు కొంతమంది ముందుకు వచ్చారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్‌లు టెండర్ వేయడంతో అధికారుల సూచన మేరకే నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. కొంతమంది ముందుకు వచ్చి డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మాణం చేపట్టుకున్నారు. వారు ఇల్లు నిర్మించుకుని సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు డబ్బులు రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ఒక్క పైసా రాలేదు

డబుల్ బెడ్ రూమ్ పథకం కింద ఇల్లు నిర్మించుకున్నా. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా రాలేదు. అధికారుల చుట్టూ డబ్బుల కోసం తిరుగుతున్నాం.

- కురుమ సాయిలు, జల్దిపల్లి

అప్పు చేసినం

డబుల్ బెడ్ రూములు నిర్మాణం కోసం లక్షల రూపాయలు అప్పులు చేసినం. ఇప్పటివరకు రూపాయి రాలేదు. ఇప్పటికి నిర్మాణం చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదు.

- రవీందర్, జల్దిపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు పూర్తయిన వారి వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు చెల్లించే విధంగా చూస్తాం. టెండర్ పని కావడంతో బిల్లులు ఆలస్యంగా వస్తాయి.

- రాకేష్, ఏఈ

పనికి విరామం.. తిరుగు ప్రయాణం

ఎడ్లబండ్లపై సొంతూరికి వలస కూలీలు



తమ గ్రామాలకు వెళ్తున్న వలస కూలీలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని గాయత్రీషుగర్ ఫ్యాక్టరీలో చెరుకు పనుల నిమిత్తం వచ్చిన వలస కూలీలు ఆదివారం సాయంత్రం తమ ఎడ్లబండ్లల్లో తిరిగివెళ్లారు. ఫ్యాక్టరీ పరిధిలో సాగుచేసిన చెరుకు పంటను కొట్టి ఫ్యాక్టరీకి తరలించేందుకు రెండు నెలల క్రితం మండలానికి కూలీ పని చేసుకునేందుకు వలస వచ్చారు. ప్రస్తుతం చెరుకు పంట పని పూర్తవడంతో తిరుగు ప్రయాణం చేపట్టారు. తమ స్వంత గ్రామాలైన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని సమీప గ్రామాలకు తమ ఎండ్లబండ్లల్లో తిరుగుబాట పట్టారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి

- జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ భార్గవ్ సుధీర్

నవతెలంగాణ-కామారెడ్డి

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు విద్యార్థిని విద్యార్థులు హాజరై విజయవంతం చేయవలసినదిగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ భార్గవ్ సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. "మేక్ ఎ రైట్ స్టార్ట్: బికమ్ ఫైనాన్షియల్లీ స్మార్ట్" అనే థీమ్‌పై ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా 'పొదుపు, చక్రవడ్డీ శక్తిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో పాటు స్లోగన్లు, డిజిటల్, సైబర్ భద్రత, పోస్టర్ రూపకల్పన అనే అంశాలపై పోటీలుంటాయని ఆయన వివరించారు. ఈ నెల 19 నుండి 23 వరకు మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్రస్థాయికి పంపుతామని తెలిపారు. ఈ నెల 26న ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ ఆవిష్కరణ, 27న 2కె రన్, 28న ఆర్థిక అక్షరాస్యత శిబిరం, 29న అన్ని పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులతో సమావేశమై ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్రసంగాలు, కార్యక్రమాలు ఉంటాయని భార్గవ్ సుధీర్ తెలిపారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని 221వ గదిలో గల 'లీడ్ బ్యాంకు కార్యాలయంలో కానీ, lbo.kamareddy@canara-bank.com వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

పదవుల కోసం పాకులాట..

- నమ్మిన పార్టీ కాదు.. పదవే ముఖ్యం..
- బాన్సువాడ నియోజకవర్గంలో పరిస్థితి



నవతెలంగాణ-నసురుల్లాబాద్

'ఆ గట్టునుంటావా నాగన్న.. ఈ గట్టుకొస్తావా నాగన్న' అనేలా తయారైంది బాన్సువాడ నియోజకవర్గంలోని పలు మండలాల్లో రాజకీయ నాయకుల పరిస్థితి. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రోజురోజుకు పోటాపోటీగా పార్టీల్లో చేరికలు జరుగుతున్నాయి.

బాన్సువాడ నియోజకవర్గం పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కంచుకోటగా నిలిచింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి 7సార్లు ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలుపొందారు. మధ్యలో 2004లో వలస వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేత బాజిరెడ్డి గోవర్ధన్, పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అనంతరం 2009లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మళ్ళీ అత్యధిక మెజార్టీతో గెలుపొంది, తెలంగాణ ఉద్యమంలో పోచారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో మళ్ళీ గెలుపొందారు. అలా ఇప్పటివరకు ఓటమి ఎరుగని నాయకునిగా పేరు తెచ్చుకున్నారు.

2023 ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. ఓ దశలో ఏనుగు రవీందర్‌రెడ్డి గెలుపొందుతున్నారని సర్వేలు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేసినా.. బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందినప్పటికీ, రాష్ట్రంలో అధికార పార్టీగా కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేయడంతో బాన్సువాడ నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలం పెరిగింది. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏనుగు రవీందర్‌రెడ్డి ఓడిపోయినప్పటికీ ఏనుగు రవీందర్‌రెడ్డి గ్రామాల్లో తిరుగుతూ గ్రామ సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులను, కార్యకర్తలను పార్టీలో చేర్చుకుంటూ అండగా ఉంటున్నారు. అలాగే ఇతర పార్టీలో అసంతృప్తిగా ఉన్న నాయకులు, కార్యకర్తలు కొందరు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.

పదవే ముఖ్యం..

రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు తహతహలా డుతున్నారు. గ్రామాల్లో పట్టు సాధించాలంటే ఏదైనా ఒక పదవి ఉండాలని ఆకాంక్షతో గ్రామస్థాయి నేతలు పదవుల కోసం పాకులాడుతున్నారు. నమ్ముకున్న పార్టీ కాదని తమకు పదవే ముఖ్యమని కొందరు బహిరంగంగా చెప్పడం విశేషం. పలువురు నేతలు చొక్కాలు మార్చినంత సులభంగా గంటల వ్యవధిలోనే పార్టీలు మారుతున్నారు. గతంలో నాయకులు కట్టుబడిన సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీల్లో కొనసాగిన ఘటనలు ఉండేవి. ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. కొందరు ప్రలోభాలకు, మరికొందరు పదవుల హామీల కోసం అర్రులు చాస్తున్నారు. దీంతో ఎవరు ఎప్పుడు పార్టీ మారుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో బీఆర్ఎస్ నేతలు తల పట్టుకుంటున్నారు. ఇతర పార్టీలో చేరిన నాయకులకు బుజ్జగింపు చర్యలు చేపడుతున్నారు.

నసురుల్లాబాద్ మండలంలో 8మంది మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, దుర్కిలో ఉన్న ప్రధాన నేతలు, మిర్జాపూర్ గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, బీర్కూర్ మండలంలో మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సుముఖంగా ఉన్నట్లు సమాచారం. తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కిష్టాపూర్ మాజీ సర్పంచ్, పలు గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నేతలతో మంతనాలు జరుపుతున్నారు. పలు గ్రామాలకు చెందిన నాయకులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. వారం రోజులు గడవక ముందే వారు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాంగెస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే మాజీ జడ్పిటిసి పోచారం శ్రీనివాసరెడ్డికి అత్యంత ముఖ్యమైన నేతగా ఉండి, పోచారం కుటుంబ సభ్యులకు రాజకీయ భవిష్యత్ లేదని ఓ ఆడియో రికార్డ్ వైరల్ కావడంతో బీర్కూర్ బీఆర్ఎస్ నేతలు ఆందోళనలో ఉన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు, కార్యకర్తలకు, నాయకులకు ధైర్యం చెప్పవలసిన అవసరం ఎతైనా ఉంది. బీఆర్ఎస్ నేతలు, నాయకులు కొందరు వివిధ కాంట్రాక్టర్ పనులు చేసిన బిల్లుల కోసం కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరుపుతున్నారు. నమ్ముకున్న నాయకుడు నమ్ముకున్న పార్టీ ముఖ్యం కాదని తమకు వ్యక్తిగత లబ్ది జరగాలంటే పార్టీ మారాల్సిందేనని కొందరు బహిరంగంగా చెప్పుకొస్తున్నారు. పార్టీలు మారుతున్న నాయకులను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.